క్లుప్తంగా

రెంటచింతల మాజీ సర్పంచి అల్లం మర్రెడ్డి మృతి



రెంటచింతల: రెంటచింతల మాజీ సర్పంచ్ అల్లం మర్రెడ్డి(79) బుధవారం మృతి చెందారు. గ్రామ పంచాయతీకి 18 ఏళ్లు సర్పంచిగా(1970–1988) పనిచేశారు. పిడుగురాళ్ల మార్కెట్‌యార్డు డైరెక్టర్‌గా, రెంటచింతల మేజర్ కాలువ సాగునీటి సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. మొదటి నుంచి అల్లం మర్రెడ్డి కాంగ్రెస్‌వాది. కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆయనకు భార్య శౌరీలమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన పెద్ద కుమారుడు ప్రతాప్‌రెడ్డి రెంటచింతలకు సర్పంచిగా, పెద్ద కోడలు అన్నమేరి, జెడ్పీటీసీ సభ్యురాలుగా ప్రత్యక్ష ఎన్నికలలో విజయం సాధించారు. భౌతిక కాయాన్ని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

కేజీబీవీలో డార్మిటరీ గదులకు నిధులు మంజూరు

క్రోసూరు: క్రోసూరులోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో బాలికలకు డార్మిటరీ గదులు(బెడ్‌రూంలు)నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు పాఠశాల ప్రత్యేక అధికారి ఇందిరా ప్రియదర్శిని బుధవారం తెలిపారు. ఆరు గదుల నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులను సమగ్రశిక్ష శాఖ మంజూరు చేసినట్లు తెలియజేశారు. పాఠశాల ఆవరణలోనే కాలేజి భవనం పక్కగా 3,724 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫస్ట్‌ఫ్లోర్‌లో మూడు గదులు, రెండవ ఫ్లోర్‌లో మూడు గదులు నిర్మిస్తారని, పనులు ప్రారంభమైనట్లు ఆమె తెలిపారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

కమిషనర్ ఆనంద్‌కుమార్



సత్తెనపల్లి: పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ అన్నారు. మున్సిపల్ శానిటేషన్ కార్మికులు చేపట్టిన వీధుల శుభ్రతను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో అపరిశుభ్రంగా ఉంటే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి, సిబ్బంది ఉన్నారు.

ఆశ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

అచ్చంపేట: మండలంలోని అచ్చంపేట-1, అచ్చంపేట-2, కొండూరు, పెదపాలెం గ్రామాలలోని ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ఇన్నారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు 10వ తరగతి ఉత్తీర్ణులై, సదరు గ్రామానికి కోడలై ఉండాలన్నారు. దరఖాస్తుతోపాటు గ్రామ ఆరోగ్య పారిశుధ్య కమిటీ తీర్మానం కాపీని జత చేయవలసి ఉంటుందన్నారు. దరఖాస్తులను ఈ నెల 28 వరకు స్వీకరిస్తారని చెప్పారు. పూర్తి వివరాలకు సమీపంలోని గ్రామ సచివాలయంలో సంప్రదించవలసినదిగా ఆయన కోరారు.

బెల్లంకొండ: మండలంలోని ఖాళీగా ఉన్న ఇద్దరు ఆశా కార్యకర్తల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ దీపికలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం, పాపాయపాలెం గ్రామాలలో ఒక్కో ఆశా కార్యకర్త పోస్ట్ ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. పదవ తరగతి పాసై, ఆ గ్రామ కోడలయి ఉన్న వారు గ్రామ ఆరోగ్య పారిశుద్ధ్య కమిటీ తీర్మాన కాపీతో దరఖాస్తులు అందించాలని కోరారు. వివరాలకు ఆయా గ్రామాల ఏఎన్ఎంలను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

క్రోసూరు: విద్యార్థులు డ్రగ్స్ పట్ల అవగాహన కలిగి ఉండి డ్రగ్స్‌ను సమాజం నుండి తరిమివేయాలని ఎస్ఐ రవిబాబు అన్నారు. క్రోసూరు ఆదర్శ పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ పి.రవిబాబు పాల్గొనగా, ప్రిన్స్‌పాల్ మేరీసూజన్ అధ్యక్షత వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ డ్రగ్స్ జీవితాలను ఎలా బలితీసుకుంటాయో, దాని వలన అసాంఘిక శక్తులుగా ఎలా మారతారో, సోదాహరణంగా పోస్టర్లు, స్లైడ్స్‌తో వివరించారు. డ్రగ్స్‌ను సమాజం నుంచి బహిష్కరించాలంటే యువత వాటిపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, తల్లిదండ్రుల పరువు ప్రతిష్టలకు భంగం కలిగించేలా వ్యవహరించకూడదని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

• చప్టాపై గుంతతో అవస్థలు



నిత్యం ఆర్టీసీ బస్సులతో రద్దీగా ఉండే బస్టాండ్ వద్ద ఉన్న చప్టాపై పెద్ద గుంత ఏర్పడింది. బస్టాండ్ లోపల నుంచి బయటికి వచ్చే ప్రతి బస్సు ఈ గుంతను చూసి చాలా జాగ్రత్తగా డ్రైవర్లు ఆర్టీసీ బస్సులను తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రాఫిక్ మళ్లింపులకు ఉపయోగించే వాటర్ బారిక్ గుంతలో వేశారు. ప్రమాదకరంగా ఉన్న ఈ గుంతను తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– పిడుగురాళ్ల

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పట్టణ సీఐ వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

పిడుగురాళ్ల: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ శ్రీరామ్ వెంకట్రావు తెలిపారు. పట్టణంలోని ఎయిర్‌టెల్ సంస్థ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎయిర్టెల్ ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎయిర్టెల్ వినియోగదారులకు ఆర్థికంగా నష్టం వాటిల్లకుండా ఉండాలని సంకల్పంతో ఏఐ ద్వారా కొత్త సాఫ్ట్‌వేర్ తీసుకురావడం అభినందనీయమని చెప్పారు. భవిష్యత్‌లో ఖాతాదారులకు వచ్చే రాంగ్ కాల్స్‌ను ముందుగానే ఏఐ ద్వారా ధ్రువీకరించి వినియోగదారుడుకి అటువంటి ఫోన్ కాల్స్ చేరకుండా చర్యలు చేపడుతుందని వివరించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వినియోగదారులకు సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ నాగరాజు, ఎయిర్టెల్ జోనల్ మేనేజర్ రాజేష్, మేనేజర్ నాగరాజు, టౌన్ డిస్ట్రిబ్యూటర్ ఉమామహేశ్వరరావు, కనిగిరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

ఎంపీడీఓ సునీత



ఆయుర్వేద వైద్యుడు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

బెల్లంకొండ: విధులలో అంకిత భావం పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో సునీత తెలిపారు. బుధవారం మండల ఆయుర్వేద వైద్యశాలలో బదిలీపై వెళ్తున్న ఆయుర్వేద వైద్యుడు ఆర్.శ్రీనివాస్‌కు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉద్యోగి ప్రజలకు అందించిన సేవలను బట్టి ప్రజల్లో, ప్రజా ప్రతినిధులలో గుర్తింపు లభిస్తుందన్నారు. ఎంఈవో బి.రాజకుమారి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఆయుర్వేద వైద్య శిబిరాలు నిర్వహించి, వైద్య సేవలను అందించారని, పాఠశాలల్లో విద్యార్థులకు ఆహారపు అలవాట్లు, ఆరోగ్యంపై అవగాహన కల్పించారని తెలిపారు. ఏడేళ్ల కాలంలో తనకు సహకరించిన మండల అధికారులకు, ప్రజలకు ఆయుర్వేద వైద్యుడు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులు వైద్యుడు శ్రీనివాస్‌ను సత్కరించారు. నూతన ఆయుర్వేద వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన స్వర్ణలతకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల నాయకులు వెన్నా సీతారామిరెడ్డి, పాకాలపాటి షేక్ మౌలాలి, గడిపర్తి చిన్నబాబు, ఆయుర్వేద సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెరుగుదల



రైతులకు సూచనలిస్తున్న ఏవో కె.దేవదాసు



రైతులతో మాట్లాడుతున్న ఏవో అరుణకుమారి

నకరికల్లు: పచ్చిరొట్ట విత్తనాలను భూమిలో చల్లి 45 రోజుల తరువాత కలియదున్నడం ద్వారా భూమిలో పోషకాలు పెరుగుతాయని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని నర్సింగపాడు, త్రిపురాపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీలుగ, జనుము, పిల్లిపెసర భూమిలో చల్లి పూత దశలో పైరును రోటోవేటర్ ద్వారా కలియదున్నాలన్నారు. ఎకరాకు 100 కేజీల సూపర్ ఫాస్ఫేట్ చల్లడం ద్వారా భూమిలో త్వరగా కుళ్లిపోయి పోషకాలు పెరుగుతాయన్నారు. పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయడం ద్వారా ప్రధాన పంటలో రసాయనిక ఎరువుల వాడకం 25 శాతం తగ్గించుకోవచ్చన్నారు. సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించి ఖర్చును తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు ఎం.డి.జాన్‌అహ్మద్, సర్పంచ్ పి.శ్రీనివాసరావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులను వాడి భూసారాన్ని పెంచుకోవాలి

రాజుపాలెం: రైతులు పచ్చిరొట్ట ఎరువులను వినియోగించుకుని భూసారాన్ని పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ కార్యాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు ఖరీఫ్ సీజన్‌పై సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ కౌలు రైతులు కౌలు కార్డు పొంది ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను పొందాలని తెలిపారు. రసాయనిక ఎరువులు విరివిగా వాడవద్దని రైతులకు సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలో తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులు ధ్రువీకరణ పత్రాలను పొందాలి

బెల్లంకొండ: కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగు ధ్రువీకరణ పత్రాలను రైతు సేవా కేంద్రాల ద్వారా పొందాలని మండల వ్యవసాయ అధికారి కె.అరుణకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని కందిపాడు, చంద్రాజుపాలెం గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ భూ యజమానుల అంగీకారంతో సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పత్తి, మిరప, వరి పంటలు సాగు చేసే రైతులు ముందుగా పచ్చిరొట్ట పైరులైన జనుము, జీలుగ, పిల్లి పెసరలను సాగు చేసుకుని భూమిలో కలియ దున్నుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అర్హత కలిగిన రైతుల వివరాలను ఈ కేవైసీ ఆటో అప్డేషన్ చేయడం జరిగిందని తెలిపారు. రైతులు విత్తనాలను లైసెన్స్ ఉన్న డీలర్ వద్దనే కొనుగోలు చేయాలని, తగిన రసీదు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవోలు రజిని, ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాజ్‌కుమార్



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు

సత్తెనపల్లి: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కన్వీనర్ జడ రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను కట్టు బానిసలుగా చేసే లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగాలను పరిరక్షించాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అప్కాస్, ప్రైవేట్ ఏజెన్సీలను అనుమతించవద్దని, మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఆయన అన్నారు. ఇంజనీరింగ్, ఎన్ఎంఆర్, బదిలీ, కోవిడ్, క్లాప్ డ్రైవర్లకు జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. డెత్, సిక్, అప్కాస్ ద్వారా రిటైర్మెంట్ అయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యుటీ చెల్లించాలని ఆయన కోరారు. గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు జీఓను వెంటనే జారీ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్‌సీ కమిటీని నియమించాలని, మున్సిపల్ కార్మికులకు జీవోఆర్‌టీ నెంబర్ 1516 అమలు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ)అధ్యక్షురాలు వంగిపరపు చంద్రకళ, బొమ్ము రాజశేఖర్, దుర్గ, శ్రీను, ఇంజనీరింగ్ కార్మికులు కుమారస్వామి, కిరణ్, జానీ పాల్గొన్నారు.

జాకీర్ కుటుంబానికి ఆర్థిక సాయం

మాచర్ల: పట్టణంలోని అనారోగ్యంతో మృతిచెందిన షేక్ జాకీర్ కుటుంబ సభ్యులకు రూ.లక్ష ఆర్థిక సాయం టీడీపీ నేతలు అందించారు. జాకీర్ కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో షేక్ మదార్‌సాహెబ్, నేతలు పాల్గొన్నారు.

గెస్ట్ అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

దాచేపల్లి: నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హతను వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ టి.జె.చంద్రశేఖర్ బాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. జూనియర్ కళాశాలలో సివిక్స్, ఇంగ్లిష్, కెమిస్ట్రీ సబ్జెక్టులను బోధించేందుకు గెస్టు అధ్యాపకులు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. 50 శాతం మార్కులతో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోగా తమ పూర్తి బయోడేటాలను కళాశాలలో అందించాలని కోరారు.

నేటి నుంచి మోడల్ స్కూల్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం

ప్రిన్సిపాల్ మేరీసూజన్

క్రోసూరు: క్రోసూరులోని ఏపీ ఆదర్శ పాఠశాలకు పిడుగురాళ్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మేరీసూజన్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి ఇప్పటికి కార్యరూపం దాల్చినట్లు తెలిపారు. గత ఏడాది మెగా పేరెంట్స్ డే సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమస్య తెలుసుకుని హామీ ఇచ్చి నెరవేర్చినట్లు చెప్పారు. పిడుగురాళ్ల డిపో ఆర్టీసీ బస్సు గురువారం నుంచి ఉదయం పిడుగురాళ్ల నుంచి క్రోసూరుకు వచ్చే మార్గంలో మోడల్ స్కూల్ వరకు వస్తుందని, క్రోసూరు నుంచి పిడుగురాళ్ల వెళ్లేప్పుడు పాఠశాల వరకు వస్తుందని తెలిపారు. త్వరలో విద్యార్థులకు బస్‌పాస్ సౌకర్యం కల్పించే విధంగా ఆర్టీసీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యేకు, డిపో అధికారులకు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు

చిలకలూరిపేట: పురపాలక సంఘ కార్యాలయంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రేంజ్ ఆఫీసర్ షేక్ సైదులు ఆధ్వర్యంలో బుధవారం రికార్డుల తనిఖీలు నిర్వహించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి ఎంత నిధులు మంజూరయ్యాయి, ఎంత క్రీడా సామగ్రి కొనుగోలు చేశారు, ఎన్ని రోజుల పాటు ఆటల పోటీలు నిర్వహించారు అని ఆరా తీశా రు. వార్డు సచివాలయాల పరిధిలో ఆటల పోటీలు నిర్వహించిన నేపథ్యంలో వారంలోగా సచివాలయాల నుంచి వివరాలు సేకరించి అందజేస్తామని మున్సిపల్ సిబ్బంది వారికి సమాధానం చెప్పారు. తాము సూచించిన ఫార్మాట్‌లో వివరాలు అందజేయాలని విజిలెన్స్ అధికారి మున్సిపల్ సిబ్బందికి సూచించారు.

ఇన్నర్ వీల్ క్లబ్‌కు పురస్కారాలు

చిలకలూరిపేట: ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేటకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకుగాను బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డుతో పాటు, మొత్తం 24 సేవా పురస్కారాలు లభించినట్లు క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని బుధవారం తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన పురస్కారాల అందజేత కార్య క్రమంలో భాగంగా ఇన్నర్‌వీల్ డిస్ట్రిక్ట్ 315 చైర్మన్ ప్రేమలత ఈ అవార్డులను అందజేశారన్నారు. ఏడాది కాలంలో చేపట్టిన 103 సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డులు అందించారని చెప్పారు. విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన, వరదల సమయంలో అందించిన సహాయం, బాలికా విద్యకు అందిస్తున్న ప్రోత్సాహం, మహిళాభ్యున్నతి చేస్తున్న కృషికిగాను అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారన్నారు. తనతో పాటు అవార్డులు స్వీకరించిన వారిలో కోలా విజయలక్ష్మి, జయలక్ష్మి ఉన్నారని వెల్లడించారు.

ప్రకృతి పద్ధతిలో ఖరీఫ్ సాగు చేపట్టాలి

నరసరావుపేట రూరల్: ఖరీఫ్‌లో పంటల సాగును ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చేపట్టాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ ఖరీఫ్ లో పత్తి పంట సాగు చేస్తున్న రైతులు పొలంలో ఘన జీవామృతాన్ని ఎకరానికి 500 కేజీలు చల్లాలని, బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వలన తెగు ళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని 118 గ్రామాల్లో 31,979 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ విధానాలను కొనసాగించేందుకు రైతులను సన్నద్ధం చేసినట్టు తెలిపారు. మిరప, వరి పంటలు సాగు చేసే రైతులకు 12 కేజీల పీఎండీఎస్ విత్తనాలను మహిళా సంఘాల ద్వారా తయారు చేసి రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచుతామని వివరించారు. ఎటువంటి రసాయనాలు లేకుండా ఒక పంట వద్దు పలు పంటలు ముద్దు నినాదంతో ఏగ్రేడ్ మోడల్, ఏటీఎం మోడల్‌ను సిబ్బంది తమ భూముల్లో సాగు చేయాలని తెలిపారు.

డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి



పిల్లుట్లలో రైతులకు వివరాలు తెలియజేస్తున్న అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ

మాచవరం: ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఓ కె.రామమ్మ అన్నారు. మండలంలోని పిల్లుట్ల, సింగరాయపాలెం తండా గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు చేసిన విత్తనాల సంచులను పంట పూర్తి అయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. నాసిరకం విత్తనాలతో పంట దిగుబడి తగ్గితే డీలర్లపై చర్యలు తీసుకోవచ్చని వివరించారు. ఎఫ్ఐజీ ఇన్సూరెన్సు జిల్లా మేనేజర్ లింగయ్య మాట్లాడుతూ పంటల బీమా పథకానికి కంది పంటకు ఎకరాకు రూ.40, మిరప పంటకు రూ.360, వరి పంటకు రూ.80 పత్తి పంటకు రూ.1900 ప్రీమియంను దగ్గర్లోని పోస్టాఫీసులో గాని, గ్రామ సచివాలయంలో గాని చెల్లించాల్సి ఉంటుందన్నారు. అన్ని పంటలకు జూలై 31 చివరి గడువు కాగా, వరి పంటకు ఆగస్టు 15 వరకు చెల్లించవచ్చన్నారు. కౌలు రైతులు కౌలు రైతు కార్డు ద్వారా ప్రీమియం చెలించ వచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కిరణ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహానాయక్, యాకూబ్ పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు : ఏడీఏ జగదీష్‌రెడ్డి

మాచర్ల: ఎరువులు విక్రయాలు నిబంధనల మేరకు నిర్వహించాలని మాచర్ల వ్యవసాయ సహాయ సంచాలకులు జగదీష్‌రెడ్డి సూచించారు. ఎరువుల దుకాణాల నిర్వాహకులు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎరువులు ఈ-పాస్ ద్వారానే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఐదు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విత్తన విక్రయ దుకాణాల్లో తనిఖీలు



దాచేపల్లిలో విత్తనాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

దాచేపల్లి: నగర పంచాయతీలోని పలు విత్తనాల దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మండల వ్యవసాయ అధికారి కంచర్ల వెంకటేశ్వర్లు విత్తనాలు దుకాణాల్లో తనిఖీలు చేసి పలు రికార్డులు పరిశీలించారు. తప్పనిసరిగా అనుమతి ఉన్న విత్తనాలనే రైతులకు విక్రయించాలని, అనుమతి లేని విత్తనాలను విక్రయించినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. దాచేపల్లిలోని పార్సిల్ కార్యాలయాలను తనిఖీ చేశారు. సిబ్బందికి విత్తనాలు, పురుగు మందుల పార్సిల్స్ వచ్చినప్పుడు వ్యవసాయ శాఖ కార్యాలయం దాచేపల్లి సమాచారం తెలియజేయాలని చెప్పారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు, రసీదులు డీలర్ల నుంచి తీసుకోవాలని సూచించారు. అధీకృత డీలర్ల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారి చెప్పారు.

సురక్షిత తాగునీరు అందించండి

సీపీఎం అమరావతి కార్యదర్శి సూరిబాబు





పంచాయతీ ద్వారా సరఫరా అవుతున్న నీరు

అమరావతి(క్రోసూరు): మేజరు పంచాయతీ అయినటువంటి అమరావతిలో పంచాయతీ పైపులైన్లు ద్వారా మురుగునీరు రావటం వలన గ్రామ ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉందని, వెంటనే బాగు చేసి సురక్షిత తాగునీరు అందించాలని సీపీఎం అమరావతి కార్యదర్శి సూరిబాబు బుధవారం విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు మూడు నెలల నుంచి పంచాయతీ ద్వారా మురుగనీరు వస్తుందని పలువురు మహిళలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కృష్ణానది పక్కనే ఉన్నా మంచినీళ్ల బదులు మురుగునీరు వస్తోందని.. వడపోసుకొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. మినరల్ వాటర్ క్యాన్ రూ.10 నుంచి రూ.30 పెట్టి కొనుక్కొని తాగాల్సిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. మేజర్ పంచాయతీ అయినా కూడా ఫిల్టర్ బెడ్లు రిపేరు చేయకపోవడం వలన మురుగునీరు వస్తుందని సూరిబాబు తెలిపారు. పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే తగువిధంగా చర్యలు చేపట్టి పైపు లైన్లు, ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మతులు చేపట్టి సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని సూరిబాబు కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- రాష్ట్ర ఆహారకమిటీ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి
- రెండు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు



చీకటీగలపాలెంలో ప్రిన్సిపల్ విజయలక్ష్మిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

వినుకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి అన్నారు. వినుకొండ రూరల్ మండలం చీకటీగలపాలెం మోడల్ స్కూల్, వినుకొండ టౌన్‌లోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. మధ్యాహ్నం భోజనం సక్రమంగా ఉంటుందా? మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందుతున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చీకటీగలపాలెం మోడల్ స్కూల్లో నాలుగురకాల కూరలకు బదులు కేవలం దోసకాయ పచ్చడి మాత్రం ఉండటంతో ప్రిన్సిపల్ విజయలక్ష్మిని నిలదీశారు. ప్రతిరోజూ కోడిగుడ్డు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించగా పైనుంచి సరఫరా లేదని తెలిపారు. వెంటనే కాంట్రాక్టరుతో మాట్లాడి సక్రమంగా గుడ్లు సరఫరా చేయకపోతే కాంట్రాక్టు రద్దు చేస్తామని హెచ్చరించారు. వినుకొండలో భోజనసతి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండేలా మెనూప్రకారం అందించాలని సూచించారు. పాఠశాల కమిటీ సభ్యుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రాధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

యడ్లపాడు: జిల్లాలోని ప్రతి పంచాయతీని చెత్తరహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులతో పాటు ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధి కారి నాగేశ్వరనాయక్ పేర్కొన్నారు. బుధవారం యడ్లపాడు మండలం వంకాయలపాడు గ్రామ పంచాయతీని ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా గ్రామంలోని పలు వీధుల్లో తిరిగి పారిశుద్ధ్య నిర్వహణ గమనించారు. ఇళ్ల నుంచి వ్యర్థాల సేకరణ జరుగుతున్న తీరును స్థానిక ప్రజలను సైతం అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని క్లోరినేషన్ పనుల్ని స్వయంగా చూశారు. చెత్త నుంచి సంపద కేంద్రానికి చేరుకుని తడిపొడి చెత్త విభజన ప్రక్రియ, వర్మీకంపోస్టు తయారీ విధానం తదితర అంశాల గురించి క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిరోజు బ్లీచింగ్ క్లోరినేషన్ చేసి తర్వాతనే తాగునీటికి పంచాయతీ కుళాయిలకు విడుదల చేయాలని ఆదేశించారు. క్లాప్‌మిత్రలు ఇంటింటికి వెళ్లి నిత్యం చెత్త సేకరణ విధిగా చేయాలని చెప్పారు. ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార దుకాణాల నుండి వెలువడే వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా వేరుచేసి క్లాప్ మిత్రలకు అందజేయాలని కోరారు.

